సాక్షి
అనంతపురం

సోమవారం । 12 । ఆగస్టు । 2024



ఆర్టీసీ బస్సు బోల్తా

పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. కర్ణాటక రాష్ట్రం గుడిబండ వద్ద ఘటన జరిగింది. 8లో



నీటి పంపింగ్ ప్రారంభం

హెచ్ఎన్ఎస్ఎస్ పథకంలో భాగంగా వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద కృష్ణా జలాల ఎత్తిపోతల ప్రక్రియ పునఃప్రారంభమైంది. 8లో

గరిష్టం/కనిష్టం
36.3°/23.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన తుంగభద్ర డ్యాం గేటు స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర డ్యాం బోర్డుకు చాలా మంచి పేరుందన్నారు. బోర్డు నిర్వహణ సమర్థవంతంగా ఉంటుందన్నారు. డ్యాం గేటు కొట్టుకుపోవడం చాలా బాధాకరమన్నారు. గేటు కొట్టుకుపోవడంతో దాదాపు రెండున్నర లక్షల క్యూసెక్కుల నీరు బయటకు వెళుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తగ్గి రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో తుంగభద్ర డ్యాంకు ఊహించని రీతిలో నీరు వచ్చి చేరడంతో రైతులు ఎంతో సంబరపడ్డారని, ఇప్పుడు డ్యాం గేటు కొట్టుకుపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వేగవంతంగా మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విత్తనాలే ఎంచుకోవాలి

- ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: రైతులు నాణ్యమైన విత్తనాలే ఎంచుకోవాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. ఢిల్లీలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ 109 రకాల విత్తన వంగడాలను విడుదల చేసే కార్యక్రమాన్ని పురస్కరించుకుని రెడ్డిపల్లి కేవీకేలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రెండు రకాలను ప్రధాని మోదీ విడుదల చేశారన్నారు. పప్పుశనగలో ఎన్‌బీఈజీ–1267, పెసరలో ఎల్‌జీజీ–610 రకాలు జిల్లా నేలలకు ఎంతో అనువైనవన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, ముత్యాల రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులతో మాట్లాడాకే మార్పులు తేవాలి

- సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను, ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకున్నాకే ఏవైనా మార్పులు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో ఆదివారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల విన్నపాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములవుతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాధ్యక్షుడు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, మహేష్, రామాంజినేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు హనుమంతు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకుపోతున్న ఆశలు

- టీబీ డ్యాంలో తెగిపోయిన క్రస్ట్ గేట్
- వృథాగా పోతున్న నీరు
- డ్యాంలో సగం నీరు ఖాళీ అయితేనే మరమ్మతులకు ఆస్కారం!
- పిడుగులాంటి వార్తతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- వేగంగా మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు వృథాగా పోతున్న నీరు

తుంగభద్ర జలాశయంపై ఇప్పటివరకూ ఎంతో ఆశతో ఉన్న రైతులపై ఒక్కసారిగా పిడుగుపడింది. డ్యాంలోని ఓ క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిందనే వార్తతో ఆందోళన మొదలైంది. ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

బొమ్మనహాళ్/రాయదుర్గం: అంతా సాఫీగా సాగిపోతోందనుకుంటున్న తరుణంలో ఊహించని పరిణామం ఎదురైంది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు జీవనాడిగా పేరుగాంచిన తుంగభద్ర డ్యాంకు ఉన్న 33 క్రస్ట్ గేట్లలో 19వ నంబర్ గేటు చైన్ తెగిపోయి కొట్టుకుపోయింది. ఈ హఠాత్పరిణామంతో ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిపోయింది. అన్నదాతలు తీవ్ర ఆందోళనలో కూరుకుపోయారు.

ఆశలు రేపి.. ఆవిరి చేసి..

గత ఏడాది వర్షాభావ పరిస్థితులతో టీబీ డ్యాంకు అనుకున్న స్థాయిలో నీరు రాలేదు. దీంతో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు కోటా మేరకు నీరు విడుదల చేయలేదు. ఆయకట్టు కింద పంట పండించుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. అయితే, ఈ ఏడాది మాత్రం వర్షాలతో తుంగభద్ర ఉగ్రరూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జలాశయానికి వరదనీరు వచ్చి చేరింది. దీంతో 32 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. హెచ్చెల్సీకి కూడా నీటి విడుదల ప్రారంభించడంతో కోటి ఆశలతో ఆయకట్టు భూముల్లో రైతన్నలు ముందస్తు సాగుకు సమాయత్తమయ్యారు. కొందరు పెంటమళ్లు సిద్ధం చేస్తుండగా, బోర్ల కింద ముందే వరి నార్లు పెంచుకున్న రైతులు నాట్లు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. హెచ్చెల్సీకి కేటాయించిన 26.36 టీఎంసీల నికర జలాలను కచ్చితంగా తీసుకొచ్చేలా అధికారులు కూడా చర్యలు చేపడుతున్న నేపథ్యంలో గేటు కొట్టుకుపోయిందన్న వార్త తెలిసి ఒక్కసారిగా వారు హతాశయులయ్యారు.

అశనిపాతమేనా..?

కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అధికారులు రంగంలోకి దిగారు. అయితే, డ్యామ్‌లో కేవలం 45 టీఎంసీల నీరు ఉంటేనే కొత్తగా గేటును అమర్చడానికి వీలు కలుగుతుందని తేల్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం డ్యాంలో ఉన్న 104 టీఎంసీల నీటిలో దాదాపు సగం వృథాగా వదిలివేయాల్సి ఉంటుంది. గేటు ఏర్పాటు పూర్తయిన తర్వాత ఇన్‌ఫ్లో భారీగా కొనసాగితేనే మళ్లీ డ్యాం నిండే అవకాశం ఉంటుంది. అయితే, కొన్ని రోజులుగా డ్యాంకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో జలాశయం నిండుతుందా, ఆయకట్టుకు నీరు అందుతుందా అన్నదానిపై నీలినీడలు కమ్ముకున్నాయి.



బొమ్మనహాళ్ సమీపంలో సాగు చేసిన వరి నారు

1953లో అందుబాటులోకి..

దక్షిణ భారతదేశంలోనే తుంగభద్ర డ్యాంకు ఘన చరిత్ర ఉంది. 1953లో డ్యాం నిర్మాణం పూర్తయింది. అప్పటినుంచి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని లక్షల ఎకరాలకు జలాభిషేకం చేస్తూ లక్షలాది మందికి జీవనోపాధిని కల్పిస్తోంది. టీబీ డ్యాం పక్కనే ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం హంపీ ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. విజయనగర రాజుల కాలంలోనే తుంగభద్ర నది నుంచి కాలువలు నిర్మించడం గమనార్హం. డ్యాం నుంచి నీటిని తీసుకొనే సందర్భంలో రైతులు అన్నదమ్ముల్లా మెలుగుతూ ఎలాంటి గొడవలకు తావులేకుండా ముందుకు సాగుతున్నారు.

మన రాష్ట్రంలో టీబీ డ్యాం ఆయకట్టు ఇలా..

- ఆయకట్టు భూములున్న జిల్లాలు – అనంతపురం, కర్నూలు, వైఎస్సార్
- హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ ఉపకాలువల కింద మొత్తం ఆయకట్టు– 2.85 లక్షల ఎకరాలు
- అనంతపురం జిల్లాలో ఆయకట్టు – 1.80 లక్షల ఎకరాలు

అనుభవమున్న కంపెనీలకు గేటు తయారీ బాధ్యత..

విజయనగరలో ఉండే తుంగభద్ర స్టీల్ తయారీ కంపెనీతో పాటు హిందూస్తాన్ స్టీల్ తయారీ కంపెనీ, నారాయణ స్టీల్ తయారీ కంపెనీకి క్రస్ట్ గేటు తయారీకి ఆర్డర్ ఇచ్చినట్లు బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి తెలిపారు. విజయవాడ లేదా హైదరాబాద్ నుంచి అనుభవజ్ఞులైన వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెగిపడిన గేటు డ్యాంలోనే ఉందా, లేదా నదిలోకి కొట్టుకొచ్చిందా అనే విషయం కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

కర్ణాటక, ఆంధ్రా ముఖ్యమంత్రుల ఆరా..

క్రస్ట్ గేటు తెగిపోవడంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు టీబీ డ్యాంను పరిశీలించారు.

రైతుల పరిస్థితి అగమ్యగోచరం



ఈ ఏడాది నీళ్లు ఆయకట్టుకు వస్తాయని ముందస్తుగానే వరి నార్లు పోసుకున్నాం. హెచ్చెల్సీకి కూడా నీటిని విడుదల చేయడంతో ఎంతో సంతోష పడ్డాం. ఇంతలోనే ఇలా జరిగింది. ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి మరలా డ్యాం నిండాలని దేవుడిని వేడుకుంటున్నాం.

–వాసుదేవరెడ్డి, రైతు, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

తట్టుకోలేకపోతున్నాం



తుంగభద్ర డ్యాంలో ఈ ఏడాది నీరు ఆశాజనకంగా ఉండటంతో బోర్ల కింద వరి, మిరప నార్లు సాగు చేశా. వారం రోజుల్లో నీరు విడుదల చేస్తారనే నమ్మకంతో సేద్యం పనులు కూడా ప్రారంభించా. ఇలాంటి సమయంలో డ్యాం గేటు విరిగిపోయి నీరు వృథాగా పోతుండటం చూసి రైతులు తట్టుకోలేకపోతున్నారు. మిగిలిన 40 టీఎంసీలతో కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు ఎలా అందిస్తారో తెలియడం లేదు.

– చిన్న తిప్పేస్వామి, రైతు, కొలగానహళ్లి, బొమ్మనహాళ్ మండలం

రెండు మూడు రోజుల తర్వాతే మరమ్మతులు



తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ నీటి ఉధృతికి విరిగిపోయి కొట్టుకుపోయింది. గేటు మరమ్మతులు ప్రారంభించేందుకు బోర్డు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నాం. డ్యాం పూర్తి స్థాయిలో నిండడంతో మరమ్మతులు చేపట్టేందుకు వీలు లేదు. రెండు, మూడు రోజులపాటు నీటిని నదికి వదిలి మరమ్మతు పనులు చేపడతాం. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నెలాఖరు, సెప్టెంబర్‌లో డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

– రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

యల్లనూరులో కీచక టీచర్



చిలమకూరు మోడల్ స్కూల్



కాంట్రాక్టు ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయక్

- కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయక్ వికృత చేష్టలు
- తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థినులు
- ఆ టీచర్‌ను విధులకు రానివ్వొద్దంటూ బాధితుల ఆందోళన
- తాత్కాలికంగా కీచకుడిని తప్పించిన మోడల్ స్కూల్ ఏడీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

యల్లనూరు: తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్నో ఆశలతో పాఠశాలలకు పంపుతుంటారు. అలాంటి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన ఓ టీచర్ కట్టుతప్పాడు. అభం శుభం తెలియని విద్యార్థినులను వేధిస్తూ పైశాచికానందం పొందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని చిలమకూరు మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో కంప్యూటర్ ఉపాధ్యాయుడిగా భాస్కర్‌నాయక్ పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఇతను 8వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. తాకకూడని చోట తాకుతూ వికృతానందం పొందుతున్నాడు. ఈ క్రమంలో విషయాన్ని పిల్లలు తమ తల్లిదండ్రులకు తెలియజేశారు. ఆగ్రహం చెందిన వారు.. వారం క్రితం పాఠశాలకు చేరుకుని ఎంఈఓ చంద్రశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేష్‌ను నిలదీశారు. అయితే, విషయం బయటకు తెలియకుండా తల్లిదండ్రులకు వారు నచ్చజెప్పారు. స్థానిక అధికారుల ఫిర్యాదు మేరకు భాస్కర్ నాయక్‌పై డీఈఓ వరలక్ష్మి, మోడల్ స్కూల్ ఏడీ నాగరాజు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి విధులకు రావొద్దని ఆదేశించారు. వేరే చోటుకు బదిలీ చేసుకోవాలని తెలియజేసినట్లు సమాచారం. అయితే, భాస్కర్‌నాయక్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ మహేష్‌ను సంప్రదించగా, వారం రోజుల క్రితం ఘటన జరిగినట్లు తెలిపారు. అప్పటి నుంచి భాస్కర్ నాయక్‌ను విధులకు రానివ్వలేదని చెప్పారు.

కమిషనర్ ఉత్తర్వులా.. ఎమ్మెల్యేల సిఫార్సులా?

- సెక్టోరియల్ పోస్టుల భర్తీపై ఉత్కంఠ
- అర్హత లేని వాళ్లను సిఫార్సు చేస్తున్న ప్రజాప్రతినిధులు!



సమగ్ర శిక్ష కార్యాలయం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీపై విద్యాశాఖలో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో మొత్తం 8 పోస్టులకు 110 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. నేడు, రేపు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారు. అర్హతలేని వారికి కొందరు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేస్తుంటే.. మరోవైపు అర్హతలున్న వారిని మాత్రమే తీసుకోవాలని విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు విద్యాశాఖ ఉన్నతాధికారులను కలవరపెడుతున్నాయి.

కమిషనర్ ఉత్తర్వులు ఇలా...

అన్ని పోస్టులకు కనీస కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. ఉపాధ్యాయుడు తన మొత్తం సర్వీస్‌లో ఐదేళ్లు డిప్యూటేషన్‌పై పని చేసి ఉండకూడదు. ఏ పోస్టుకైనా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తుండాలి. నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నాటికి 55 ఏళ్లలోపు ఉండాలి. గతంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుని ఉంటే అర్హులు కారు.

ఏ పోస్టుకు ఎవరెవరు అర్హులంటే...

- ఏఎంఓ (అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 8 ఏళ్ల అనుభవం ఉండాలి. స్కూల్ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి.
- సీఎంఓ (కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 8 ఏళ్ల అనుభవం ఉండాలి. స్కూల్ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి.
- జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 8 ఏళ్ల అనుభవం ఉండాలి. స్కూల్ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి. మహిళా టీచర్లు మాత్రమే అర్హులు.
- ఏఎస్ఓ (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 5 ఏళ్ల అనుభవం ఉండాలి. గణితం/స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీతో పాటు డిప్లొమా ఇన్ కంప్యూటర్ చేసి ఉండాలి.
- అసిస్టెంట్ ఏఎంఓ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల అనుభవం ఉండాలి. స్కూల్ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి.
- అసిస్టెంట్ అలెస్కో (అసిస్టెంట్ అల్టర్‌నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల అనుభవం ఉండాలి. సోషియాలజీ/సోషల్‌వర్క్/ఆంత్రోపాలజీ/మ్యాథ్స్/సైన్స్ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి.
- అసిస్టెంట్ ఐఈడీ పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల అనుభవం ఉండాలి. జువాలజీ/బాటనీ/సైకాలజీ సబ్జెక్టుల్లో పీజీ ఉండాలి. బీఈడీ/డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి లేదా స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 45/90 రోజుల ఫౌండేషన్ కోర్స్ చేసి ఉండాలి.
- కమిషనర్ ఉత్తర్వులు ఇలా ఉండగా, ప్రజాప్రతినిధులేమో కొందరు అనర్హులకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిసింది. కమిషనర్ ఉత్తర్వులకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

క్షీణిస్తోన్న భూగర్భజలం



అనంతపురం అగ్రికల్చర్: భూగర్భజలాలు క్రమంగా క్షీణిస్తున్నాయి. ఇదే పరిస్థితి రెండు నెలలు కొనసాగితే వేసవిలో తాగునీటి గండం ఎదుర్కోవాల్సి ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉన్న నీటి వనరులు విచ్చలవిడిగా తోడేస్తుండటంతో పాతాళగంగ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పేరుకు వర్షాకాలమైనా 55 రోజులుగా వరుణుడు పత్తా లేకుండా పోయాడు.

54 ప్రాంతాల్లో తగ్గుదల..

భూగర్భజలాల పరిస్థితి తెలుసుకునే నిమిత్తం జిల్లా వ్యాప్తంగా 31 మండలాల పరిధిలో 97 ఫిజోమీటర్లు అమర్చారు. వాటి ద్వారా భూగర్భజలశాఖ తాజాగా సేకరించిన గణాంకాలు పరిగణనలోకి తీసుకుంటే 13.35 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది. 97 ఫిజోమీటర్లకు గానూ 54 ఫిజోమీటర్లలో నీటిమట్టం క్రమంగా తగ్గుదల నమోదవుతున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. రాయదుర్గం మండలంలో ఒక ఫిజోమీటర్‌లో ఏకంగా 47.30 మీటర్ల లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. శెట్టూరు మండలం చెర్లోపల్లి ఫిజోమీటర్‌లో కూడా 46.10 మీటర్లు, పుట్లూరు ఫిజోమీటర్‌లో కూడా 45.81 మీటర్లుగా రికార్డు కావడం ఆందోళన కలిగించే అంశంగా చెబుతున్నారు. 9 మండలాల్లో 15 మీటర్లకు పైగా లోపలికి చూసినా నీటిమట్టం కనబడని పరిస్థితి నెలకొంది. 8 మండలాల్లో 8 మీటర్ల లోపు, 12 మండలాల్లో 15 మీటర్లలోపు నీటిమట్టం రికార్డయినట్లు భూగర్భజలశాఖ డీడీ తిప్పేస్వామి తెలిపారు.

వర్షాలు పడకుంటే ఇక్కట్లే..

మే 15 నుంచి జూన్ 15 వరకు జిల్లా వ్యాప్తంగా మంచి వర్షాలు నమోదయ్యాయి. సాధారణం కన్నా 150 శాతం అధికంగా వర్షపాతం నమోదు కావడంతోనే ఈ మాత్రం భూగర్భజలాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ వర్షాలు లేకుంటే ఇప్పటికే ప్రమాదకరంగా ఉండేవని అంచనా వేస్తున్నారు. జూన్ 15 తర్వాత వరుణుడి జాడ లేకపోవడంతో భూగర్భ జలం క్షీణిస్తున్నట్లు గుర్తించారు. మొత్తమ్మీద జూలై ఆఖరు నాటికి 117.9 మి.మీ వర్షం పడాల్సి వుండగా జూన్ మొదటి పక్షంలో విస్తారంగా వర్షాలు పడటంతో 43 శాతం అధికంగా 170 మి.మీ నమోదైంది. జూన్ 14 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు గత 55 రోజుల్లో అక్కడక్కడా కురిసిన తేలికపాటి వర్షాలకు కేవలం 40 మి.మీ మాత్రమే నమోదైంది. 20 మండలాల పరిధిలో రోజురోజుకు నీటి మట్టం తగ్గుతుండటం ఆందోళన కలిగించే విషయమని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పటికే ఉద్యాన తోటల సంరక్షణ రైతులకు సవాల్‌గా మారింది. పట్టు, పాడి పశుపోషణకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో సరైన వర్షాలు పడకపోతే వచ్చే వేసవిలో తాగునీటి ఇక్కట్లు తప్పవని చెబుతున్నారు.

రైల్వే సొమ్ము రాళ్ల పాలు!

- గుంతకల్లు రైల్వేలో నాసిరకంగా అభివృద్ధి పనులు
- కమ్యూనిటీ హాల్, క్వార్టర్స్ నిర్మాణానికి రీసైక్లింగ్ రాళ్లు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రైల్వే అధికారులు





కమ్యూనిటీ హాలు ప్రహరీ నిర్మాణానికి వినియోగిస్తున్న పాత రాళ్లు, డంప్ చేసిన పాత రాళ్లు

గుంతకల్లు: ఎవరేమనుకున్నా, ఎన్ని అరెస్టులు జరిగిన రైల్వే అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదు. ఆస్కారమున్న ప్రతి చోటా అవినీతికి పాల్పడుతూ డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారు. రైల్వే డివిజన్ కేంద్రమైన గుంతకల్లులో రూ.3.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించడమే ఇందుకు నిదర్శనం.

నిబంధనలకు విరుద్ధంగా పాత రాళ్లు..

అభివృద్ధి పనులకు సంబంధించి రూ.3.50 కోట్ల టెండరును ఇద్దరు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. గుంతకల్లు పట్టణంలోని రైల్వే కమ్యూనిటీ హాలును అభివృద్ధి పరచడంతోపాటు కొన్ని క్వార్టర్స్‌కు మరమ్మతులు, ప్రహరీ ఎత్తు పెంచడం వంటి పనులు చేపట్టాలి. అయితే కాంట్రాక్టర్లతో రైల్వే ఉన్నతాధికారులు కుమ్మక్కు కావడంతో పనుల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి పనుల్లో పాత రాళ్లు (కట్టడాలను కూల్చివేయగా సేకరించినవి) వినియోగిస్తున్నారు. వాస్తవానికి క్వారీ నుంచి సేకరించిన రాళ్లనే వినియోగించాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే క్వార్టర్స్ శిథిలాల నుంచి రాళ్లను సేకరించి అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత విభాగం అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

సీబీఐ అరెస్టుల తర్వాతా మారని వైనం..

గుంతకల్లు రైల్వేలో అధికారుల అవినీతిపై నిఘా ఉంచిన సీబీఐ అధికారులు ఇటీవలే కొందరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ల నుంచి భారీగా లంచాలు, బంగారు ఆభరణాలు ముడుపులుగా స్వీకరించారని తేలడంతో డీఆర్ఎంతోపాటు మరో ఇద్దరు ఉన్నత స్థాయి రైల్వే అధికారులను సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ స్థాయిలో అరెస్టులు జరిగినా ఏ మాత్రం భయపడని అధికారులు యథేచ్ఛగా మళ్లీ అవినీతికి తెరలేపారు.

రీ సైక్లింగ్‌లో అవినీతి కుంభకోణం..

నిజానికి పాత రాళ్ల వ్యవహారం మొత్తం ఓ అవినీతి కుంభకోణంగానే కనిపిస్తోందని కొందరు రైల్వే అధికారులు అంటున్నారు. మొదట డివిజన్‌లో వందల సంఖ్యలో శిథిలమైన క్వార్టర్స్‌ను గుర్తించి అందులోని పాతరాళ్లను అతి తక్కువ ధరతో ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఒక్కొక్క రాయిని 50 పైసలకే దక్కిచుకున్న ఆ కాంట్రాక్టర్ అనంతరం రూ.3తో తిరిగి రైల్వే కాంట్రాక్టర్లకే విక్రయించినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం క్వారీ నుంచి సేకరించే ఒక్కో రాయి ధర రూ.7గా ఉంటోంది. దీంతో రాయిపై రూ.4 చొప్పున మిగులుతుండడంతో కాంట్రాక్టర్లు పాత రాళ్లను కొనుగోలు చేసి రైల్వే పనులు పూర్తి చేస్తున్నట్లు సమాచారం.

బిల్లులు చెల్లించేటప్పుడు పరిశీలిస్తారట..

నాసిరకం, పాత రాళ్లను అభివృద్ధి పనుల్లో వాడుతున్న అంశాన్ని రైల్వే సంబంధిత విభాగం అధికారుల వద్ద 'సాక్షి' ప్రస్తావించింది. దీనిపై అధికారులు సూటిగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఏ రాయి వాడినా బిల్లులు చెల్లించేటప్పుడు పరిశీలించి కోత పెడతామని పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులే బాధ్యతారాహిత్యంతో సమాధానమివ్వడం గమనార్హం.

క్లుప్తంగా

విద్యార్థిని ఆత్మహత్య


భవాని (ఫైల్)

పెద్దపప్పూరు: తాను కోరుకున్న చోట ఇంజినీరింగ్‌లో సీటు దక్కకపోవడంతో క్షణికావేశానికి లోనై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం రెడ్డిపల్లికి చెందిన బెడుదూరు నాగరాజు కుమార్తె భవాని (18) ఇటీవల ఇంటర్ పూర్తి ఏపీఈఏపీ సెట్ పరీక్ష రాసింది. అయితే ఆశించిన స్థాయిలో ర్యాంక్ రాకపోవడంతో తనకు ఇంజినీరింగ్‌లో సీటు రాదేమోనని తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంతో తండ్రి ఆమెకు నచ్చచెప్పాడు. ఎంత ఖర్చైనా పర్వాలేదు ప్రైవేట్‌గానైనా చదివిస్తానని ధైర్యం చెప్పాడు. అయితే తాను కోరుకున్న కళాశాలలో సీటు దక్కదేమోననే అనుమానంతో క్షణికావేశానికి లోనైన ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం భవాని మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

- 13 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన లోతట్టు ప్రాంతంలో బోల్తాపడింది. ఆదివారం బెంగళూరు నుంచి పుట్టపర్తికి బయల్దేరిన పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కర్ణాటక రాష్ట్రం గుడిబండ మండల పరిధిలోకి చేరుకుంది. డ్రైవర్ స్టీరింగ్‌పై అదుపుతప్పడంతో బస్సు క్షణాల్లో ఎడమవైపు లోతట్టు ప్రాంతంలోకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టి తర్వాత నిలబడింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో మొత్తం 13 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చిక్ బళ్ళాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిలో డ్రైవర్ కూడా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

యువకుడి ఆత్మహత్య

శెట్టూరు: మండలంలోని బచ్చేహళ్లికి చెందిన మహేష్(27) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బోయ భీమలింగప్పకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి వెనుకనే ఉన్న చింత చెట్టుకు రెండో కుమారుడు మహేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న కొందరు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. కాగా, మహేష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహిళా విద్యలో మణిమకుటం

- కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు
- రెండు కోర్సులతో ప్రారంభమై... 18 కోర్సులు అందిపుచ్చుకుని...
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థినులకు పూర్తి భద్రత
- ఈ ఏడాది నుంచి అందుబాటులోకి ఆరు కొత్త కోర్సులు


కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థినులు


కళాశాల ప్రధాన ద్వారం


కళాశాలలోని లైబ్రరీ

అనంతపురం ఎడ్యుకేషన్: కేఎస్ఎన్ (కొాశెట్టి సుభద్రమ్మ నారాయణప్ప) ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల... అనంతపురంలోని భైరవనగర్ ఆర్డీఏ కార్యాలయం వెనుక... సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పక్కనే ఉన్న ఈ కళాశాలకు ఘనమైన చరిత్రే ఉంది. 1984లో కేవలం రెండు కోర్సుల (బీఏ, బీకాం)తో అనంతపురంలోని మొదటి రోడ్డు శారద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల భవనాల్లో ప్రారంభమైన కేఎస్ఎన్ నేడు 18 కోర్సులతో రాయలసీమలోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కార్పొరేట్‌కు మించి నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థినులకు పూర్తిస్థాయి భద్రత కల్పిస్తుండడంతో ఈ కళాశాలలో చేరేందుకు విద్యార్థినులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆయా కోర్సుల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతోంది.

2011లో పక్కా భవనంలోకి...

శారద మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను అనంతరం సప్తగిరి సర్కిల్‌లోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల పక్కకు మార్చారు. ఈ క్రమంలోనే 2007లో 'నాక్' అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 'సీ ప్లస్‌ప్లస్' గ్రేడ్ వచ్చింది. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పక్కనే నాలుగు ఎకరాల్లో నిర్మించిన పక్కా భవనాల్లోకి 2011లో కళాశాలను మార్చారు. హాస్టల్ వసతి కూడా ఉండడంతో ఈ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి విద్యార్థినులు ఆసక్తి చూపుతూ వస్తున్నారు. 1,700 మంది విద్యార్థినులు ఉన్నారు. 50 మంది అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. కళాశాల ఆవరణతో పాటు తరగతి గదుల్లోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటోంది. డిజిటల్ లైబ్రరీ ద్వారా మూడు వేలకు పైగా పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు.

కొత్తగా అందుబాటులోకి వచ్చిన కోర్సులు ఇవే

- బీకామ్ (బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్)
- బీఎస్సీ హానర్స్ (హోమ్ సైన్స్)
- బీబీఏ హానర్స్ (రిటైల్ ఆపరేషన్)
- బీఎస్సీ హానర్స్ (మైక్రోబయాలజీ)
- బీఎస్సీ హానర్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)
- బీఎస్సీ హానర్స్ (స్టాటిస్టిక్స్)

రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలగా...

కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు 2014లో నాక్ 'బీ' గ్రేడ్ దక్కింది. ఆ తర్వాత 2022, ఏప్రిల్‌లో 'ఏ' గ్రేడ్ దక్కించుకుంది. ఎస్కే యూనివర్సిటీ పరిధిలో తొలిసారి నాక్ 'ఏ' గ్రేడ్ పొందిన ఏకైక కళాశాలగా అప్పట్లో ఖ్యాతిగాంచింది. ఇందుకుగాను అదే ఏడాది ఉన్నత విద్యాశాఖ నుంచి 'రసస్వద–ది అప్రిసియేషన్ 2022' అవార్డును అందుకుంది. అదే విద్యా సంవత్సరం జూన్‌లో పదేళ్ల పాటు 'స్వయం ప్రతిపత్తి (అటానమస్)' హోదా సాధించింది. 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ ప్రక్రియలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందింది. పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్యా బోధనకుగాను ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన రాష్ట్రంలోనే మొదటి కళాశాలగా గుర్తింపు దక్కించుకుంది. గత రెండేళ్లుగా 300కు పైగా క్యాంపస్ డ్రైవ్‌లు చేపట్టి అర్హులైన వారు ఉద్యోగాలకు ఎంపికయ్యేలా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థినులకు పూర్తి భద్రత



మా కళాశాలలో విద్యార్థినులకు పూర్తి స్థాయి భద్రత కల్పించాం. సీసీ కెమెరాల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నాం. నాణ్యమైన బోధనతో విద్యార్థినులకు ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తున్నాం. అందరి సహకారంతో ఇప్పటి వరకూ చాలా విజయాలు సాధించాం. రాష్ట్రంలోనే మా కళాశాలకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు రావడం సంతోషదాయకం. అదే స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం. – డాక్టర్ పి.శంకరయ్య ప్రిన్సిపాల్, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల

ఆహ్లాదకరమైన వాతావరణం



కార్పొరేట్ కళాశాలకు దీటుగా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో మా కళాశాల ఉంది. నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యా బోధన, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌తో పాటు అప్పుడప్పుడు సెమినార్లు, యోగా, పోటీ పరీక్షలకు సంబంధించి అధ్యాపకుల మోటివేషన్ చాలా బాగుంటుంది. మాలాంటి పేద విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించారు. – ఎస్.అరుణ బీఏ ద్వితీయ సంవత్సరం

భవిష్యత్తుకు గట్టి పునాది



కళాశాలలో రెండేళ్లుగా తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నా. ఇక్కడ చదువుతున్న వారిలో ఎక్కువ మంది పేద విద్యార్థినులే. వీరికి చదువుతో పాటు మానవతా విలువలు నేర్పుతున్నాం. ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. విద్యార్థినులు కూడా చాలా క్రమశిక్షణతో మెలుగుతున్నారు. – అంజనరెడ్డి, అధ్యాపకుడు

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా



మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానాన్ని పరిచయం చేస్తూ పిల్లల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేస్తున్నాం. అన్ని రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా, ప్రపంచ స్థాయి కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. – సి.రామాంజనేయులు అధ్యాపకుడు

చాలా బాగుంది



మా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అన్ని విషయాల్లోనూ మమ్మల్ని ప్రోత్సహిస్తూ నైపుణ్యాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. సంస్కారంతోపాటు సమాజంలో ఎలా మెలగాలి అనే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. ఈ కళాశాలలో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారి విజయాలను వివరిస్తూ మాలో స్ఫూర్తి రగిలిస్తున్నారు. – పి.కళ్యాణి, బీఏ ద్వితీయ సంవత్సరం

టీబీ డ్యామ్ భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంపై సీపీఎం జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. 96 ఏళ్ల డ్యామ్ చరిత్రలో ఇలా జరగడం మొదటి సారి అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. డ్యామ్ భద్రతపై కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు తక్షణం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్యాం ఎగువన అధిక వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగి ఇప్పటికే రోజూ లక్ష క్యూసెక్కుల నీరు కిందకు వదులుతున్నారన్నారు. ఈ నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం మన రాష్ట్రంలో లేకపోవడంతో అత్యధికంగా నీరు సముద్రంలో కలుస్తోందన్నారు. ఒకవైపు జిల్లాలో వర్షాలు లేక సాగుభూములు బీడుగా మారుతుంటే మరోవైపు డ్యామ్‌లో ఉన్న నీటిని సక్రమంగా ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. వరద కాలువను నిర్మించాలని, తద్వారా డ్యామ్ నుంచి వచ్చే అదనపు నీటిని దిగువన ఉన్న అనంతపురం జిల్లా అభివృద్ధికి ఉపయోగించాలని చాలా కాలంగా జిల్లా ప్రజలు కోరుతున్నా... ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదని మండిపడ్డారు. వరద కాలువ నిర్మాణానికి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, హెచ్చెల్సీ ఆధునీకీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేశారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ఉపాధి హామీ పథకం కింద గ్రామ సభలు నిర్వహించడంతో పాటు కూలీలందరికీ పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబు కార్డు పొందిన ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అదే క్రమంలో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలన్నారు.

నీటి పంపింగ్ ప్రారంభం

వజ్రకరూరు: హెచ్ఎన్ఎస్ఎస్ పథకంలో భాగంగా వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద కృష్ణా జలాల ఎత్తిపోతల ప్రక్రియ పునః ప్రారంభమైంది. ఈ నెల 1వ తేదీన నంద్యాల జిల్లా మల్యాల వద్ద నీటి పంపింగ్ ప్రారంభించగా 6వ తేదీ రాత్రి 9 గంటలకు రాగులపాడు లిఫ్ట్‌కు చేరుకున్నాయి. అదే రోజు రాత్రి 10 గంటలకు రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోశారు. ఈ క్రమంలో 57వ కిలోమీటర్ వద్ద కాలువ నిర్వహణ పనుల్లో భాగంగా ఈ 9న ఒక రోజు పంపింగ్‌ను ఆపేశారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి మూడు పంపులతో నీటి పంపింగ్ ప్రారంభించారు. దాదాపు 908 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు హంద్రీనీవా ఏఈ తెలిపారు.

పోక్సో కేసులో రిమాండ్

పామిడి: పోక్సో కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలు... పామిడి మండలంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి కుమార్తె (మైనర్)ను వారం రోజుల క్రితం గుంతకల్లుకు చెందిన హాజీవలి తన వెంట పిలుచుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ఆదివారం హాజీవలిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

117 జీఓ రద్దుకు ఉద్యమిస్తాం

- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీఓ 117 రద్దుకు ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీఓ 117 రద్దు చేయకపోతే భవిష్యత్తులో వందలాది ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్ల సర్దుబాటుకు ముందు బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌ను తక్షణమే తొలిగించి సీఈఆర్టీ మాత్రమే అమలు చేయాలన్నారు. సమాంతర బోధనా మాధ్యమాల్లోనే కొనసాగించడంతో పాటు ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు తెలుగు మాధ్యంలోనే పరీక్ష రాసే అవకాశం ఇవ్వాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేస్తూ ఓపీఎస్ అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు బి.నరసింహులు, జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, గౌరవ అధ్యక్షుడు డి. ప్రభాకర్, గౌరవ సలహాదారు బి. వెంకటేశ్వర్లు, బి. బొమ్మయ్య, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

చారిత్రక సంపదను కాపాడుకుందాం


ప్రాచీన శిలాయుగం నాటి పనిముట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్: చారిత్రక సంపదను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక ఆదిమూర్తి నగర్‌లోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా మ్యూజియంను ఆదివారం ఆయన సందర్శించారు. రాతి విగ్రహాలు, జైన తీర్థంకర ప్రతిమలు, ప్రాచీన... నవీన శిలాయుగానికి చెందిన రాతి పనిముట్లు, టెర్రకోట... సున్నపు బొమ్మలు, పురాతన ఇటుకలు, కాంస్య విగ్రహాలు, దారు శిల్పాలు, ఆయుధాలు, రాగి శాసనాలు, నాణేలు, తాటాకు పత్రాలను ఆసక్తిగా పరిశీలించారు. వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామ, మండల, మున్సిపల్ ప్రాంతాల్లో ఏదైనా చారిత్రక వస్తువులు లభ్యమైతే వాటిని జిల్లా మ్యూజియంకు చేర్చాలని పిలుపునిచ్చారు. తద్వారా నాటి సంస్కృతి, చరిత్రను ముందు తరాల వారికి అందించినట్లవుతుందన్నారు. మ్యూజియం డిస్‌ప్లేలో కొన్ని మార్పులు సూచించారు. లైబ్రరీలో పూర్తి స్థాయి ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మ్యూజియం సహాయ సంచాలకులు రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, గంగా నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అరవింద్ మృతికి కారణం డాక్టర్లే

- 'మీ కేర్' ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన
- స్తంభించిన రాకపోకలు


ఆందోళన చేస్తున్న అరవింద్ బంధువులు, స్నేహితులు

గుంతకల్లు: అరవింద్ మృతికి 'మీ కేర్' ఆస్పత్రి వైద్యులే కారణమంటూ ఆదివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అరవింద్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆస్పత్రి ఎదుట దాదాపు 4 గంటల పాటు బైఠాయించారు. ఘటనతో 60 అడుగుల రహదారిలో రాకపోకలు స్తంభించాయి. వివరాలు... గుంతకల్లులోని హనుమేష్ నగర్‌లో నివాసముంటున్న మల్లేశ్వరి, రవి దంపతులకు ప్రదీప్‌కుమార్, కార్తీక్, అరవింద్ కుమారులు. కొన్నేళ్ల క్రితమే రవి మృతి చెందాడు. శ్రావణి అనే అమ్మాయిని అరవింద్ ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది వయసున్న ఓ చిన్నారి ఉంది. కొంత కాలంగా కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న అరవింద్ 9 రోజుల క్రితం 'మీ కేర్' ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. డాక్టర్ శ్రీనివాసులు యాదవ్ వైద్య పరీక్షలు నిర్వహించి యూరినరీ ట్రాక్‌లో 8ఎంఎం పరిమాణంలో రాయి ఉన్నట్లుగా గుర్తించారు. ఈ రాయి బయటకు రావడానికి పదుల సంఖ్యలో సెలైన్ బాటిళ్లు పెట్టారు. రెండు, మూడు రోజుల పాటు చికిత్స అనంతరం తీవ్రమైన జర్వం, వాంతులయ్యాయి. యూరస్ ఇన్‌ఫెక్షన్‌తో పాటు కిడ్నీలలోనూ ఇన్‌ఫెక్షన్ అయిందని, మెరుగైన వైద్యం కోసం వెంటనే కర్నూలుకు తీసుకెళ్లాలని 'మీ కేర్' ఆస్పత్రి డాక్టర్లు సూచించారు. దీంతో కర్నూలులోని హోమ్‌సీ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. యూరినరీ ట్రాక్‌లో రాయితో పాటు షుగర్ దాదాపు 360 పాయింట్లకు చేరుకుందని వైద్యులు గుర్తించారు. అలాగే రక్త కణాలు పడిపోతుండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో బంజారా హిల్స్‌లోని టీఎస్ మల్టీ సూపర్ స్పెషల్ ఆస్పతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం అరవింద్ మృతి చెందాడు. తమ తమ్ముడికి షుగర్ ఉన్న విషయాన్ని గుర్తించకుండా మోతాదుకు మించి సెలైన్ బాటిళ్లు పెట్టి మృతికి కారణమయ్యారంటూ ఆదివారం 'మీ కేర్' ఆస్పత్రి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో సీఐలు గణేష్, రామసుబ్బయ్య, ఎస్ఐ సురేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

మహిళ మృతి


మృతురాలు ఎరుకలమ్మ

ఎర్రగుంట్ల (వైఎస్సార్ జిల్లా): అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిమ్మంపల్లికి చెందిన దేవరింటి ఎరుకలమ్మ(60) ఆదివారం వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట వద్ద ఆదివారం మృతదేహమై కనిపించింది. పట్టణ సీఐ నరేష్‌బాబు వివరాల మేరకు.. ఎర్రగుంట కడప రోడ్డులోని ధాబా పక్కన పొలంలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి శరీరంపై ఆభరణాలు, బ్యాగులోని పర్సులో డబ్బులు, ఇతర ఆధారాలను బట్టి దేవరింటి ఎరుకలమ్మగా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో మృతురాలి కుమారుడు అక్కడకు చేరుకుని ధ్రువీకరించారు. కాగా, ఆమె మిస్సింగ్ అయినట్లు పులివెందుల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అ'పూర్వ' కలయిక



అనంతపురం ఎడ్యుకేషన్: వారంతా 1973–74 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు. 50 ఏళ్ల తర్వాత తిరిగి అదే పాఠశాలలో 'స్వర్ణోత్సవ కలయిక' పేరుతో ఆదివారం కలుసుకున్నారు. ఇందుకు అనంతపురంలోని పొట్టి శ్రీరాములు నగర పాలక ఉన్నత పాఠశాల వేదికైంది. కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయుడు ఇష్తకర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణంలో కలయతిరుగుతూ.. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన తెలుగు పండిట్ పుల్లన్న, సైన్స్ టీచర్ కృష్ణమూర్తి, లెక్కల మాస్టర్, తెలుగు టీచర్ సూర్యనారాయణశాస్త్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పుట్లూరు శ్రీరాములు, రత్నకుమార్, ఓబిరెడ్డి, రఘురాం, రవిశంకర్ గౌడ్, రాజకుమార్, డీసీఎస్ ప్రసాద్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోసేవ



గోసేవలో పాల్గొన్న ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోసేవలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న ఇస్కాన్ గోశాల, సోములదొడ్డి అభయాంజనేయ స్వామి ఆలయంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు ప్రమోద్ స్వామి మాట్లాడుతూ.. గోసేవ ప్రాముఖ్యతను తెలిపారు. ముక్కోటి దేవతల ప్రతిరూపమైన గోసేవతో సకల పుణ్యాలు కల్గుతాయన్నారు. అందులోనూ శ్రావణంలో చేసే పూజల వల్ల విశేష పుణ్యఫలముంటుందన్నారు. కార్యక్రమంలో గోసేవకులు రాము, ప్రసాద్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన పంపు ఇంద్రశేఖర్, పంపు దీప్ చంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురంలోని ఇమేజ్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు మాధుర్య రోగులకు వైద్య పరీక్షలు చేశారు. తొలుత సర్పంచ్ సాకే తిరుపాలు, మండల కన్వీనర్ పంపు కొండప్ప కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 120 మంది వైద్యం చేయించుకున్నారు. 10 రోగులను ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగులకు పూజలు



నీలకంఠేశ్వర స్వామి ఆలయ సమీపంలో నాగుల కట్టకు పూజలు చేస్తున్న మహిళలు

రాప్తాడు: నాగమ్మా.. నాగమయ్యా, మా పూజలు అందుకుని చల్లగా ఉండేలా దీవించాలని భక్తులు వేడుకున్నారు. నాగుల పంచమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేకువజాము నుంచి మహిళలు నాగుల కట్టలు, పుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి నాగదేవతలను స్మరించుకున్నారు. నాగుల దేవతలకు నువ్వులు, చలిపిండి, నువ్వుల పిండి, కొబ్బెర, బెల్లం నైవేద్యంతో పాటు నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వధువరులు నాగుల కట్టల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రావణ మాసం మొదటి ఆదివారం కావడంతో మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

జోరుగా పూడికతీత పనులు



సప్తగిరి సర్కిల్‌లో పూడికతీత పనులు చేపడుతున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం పూడికతీత పనులు చేపట్టేలా ప్రజారోగ్యాధికారులు చర్యలు తీసుకున్నారు. సప్తగిరి సర్కిల్, పాతూరు, రాణినగర్, హౌసింగ్ బోర్డు, రజక్‌నగర్, సోమనాథ్ నగర్ తదితర ప్రాంతాల్లో పూడికతీత తొలగించారు. ప్రధానంగా సుభాష్ రోడ్డులో కాలువ నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఆ ప్రాంతంలో మురుగు బ్లాక్ అయితే వాటిని తొలగించారు.

టీబీ డ్యాం గేట్‌కు మరమ్మతులు చేయాలి

అనంతపురంఅర్బన్: కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. డ్యామ్ భద్రతపై పర్యవేక్షణ లేకపోవడం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. గేటు కొట్టుకుపోవడంతో 35 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోందని పేర్కొన్నారు. గేట్ల పటిష్టతను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో వర్షాలు కురవక కరువు నెలకొన్న ఈ పరిస్థితుల్లో తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడం బాధాకరమని తెలిపారు. మరమ్మతు పనులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలన్నారు.

విజ్ఞాన వారధులు



అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయం

- సాహిత్య ప్రచారకులుగా సేవలందిస్తున్న గ్రంథాలయ పాలకులు
- గ్రంథాలయాలను సమర్థవంతంగా నడపడంలో కీలకపాత్ర

సందర్భం: నేడు లైబ్రేరియన్స్ దినోత్సవం

అనంతపురం /అనంతపురం కల్చరల్: మనిషి మనో వికాసానికి ఇతోధికంగా దోహదపడే సాధనాల్లో గ్రంథాలయాలు కీలకం. గ్రంథాలయాలను తమదైన ప్రతిభా విశేషాలతో సమర్థవంతంగా నడిపే గ్రంథాలయ పాలకుల వల్లే అందరం విజ్ఞాన గగనతలంలో విహరించగల్గుతున్నాము. విజ్ఞానానికి, పాఠకులకు మధ్య వారధిగా నిలచే గ్రంథాలయ పాలకులకంటూ చరిత్రలో ఓ రోజును కేటాయించారు. లైబ్రేరియన్స్ ప్రాధాన్యతను తెలుపుతూ ప్రతి ఆగస్టు 12న 'లైబ్రేరియన్స్ డే'గా జరుపుకుంటాం. జిల్లా వ్యాప్తంగా 79 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో 9 గ్రామీణ గ్రంథాలయాలు ఉండగా.. మొత్తం రెగ్యూలర్ లైబ్రేరియన్స్ 37 మంది, ఔట్‌సోర్సింగ్ లైబ్రేరియన్స్ ముగ్గురు, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ 21 మంది గ్రంథాలయాలను సమర్థవంతంగా నడుపుతున్నారు. జిల్లాలో 80 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీలు) ఉన్నాయి. సగటున రోజుకు వేలమంది పాఠకులు, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారు.

లైబ్రేరియన్ల ప్రధాన సమస్యలివే..

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలి.
- ప్రమోషన్లలో గ్రేడ్-3 గ్రంథాలయ అధికారులకు గ్రేడ్-2 పదోన్నతి కల్పించాలి.
- గ్రంథాలయాల ఆధునికీకరణ జరగాలి. చాలా చోట్ల గ్రంథాలయ అధికారి లేకున్నా కింది స్థాయి ఉద్యోగులతో లైబ్రరీలు నడుస్తున్నాయి. అలా కాకుండా అర్హత కల్గిన లైబ్రేరియన్లను తీసుకోవాలి.
- రోజురోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసి కంప్యూటర్‌పై ఎప్పటికప్పుడు తరగతులు నిర్వహించాలి.
- పదోన్నతుల్లో గ్రేడ్-2 నుంచి మాత్రమే గ్రేడ్-1 ప్రమోషన్ కల్పించాలి. ఇప్పటి వరకు ఉన్న 1:1 కాకుండా 1:3 రేషియోలో పదోన్నతులు కల్పించాలని లైబ్రేరియన్లు డిమాండ్ చేస్తున్నారు.

పాఠకులతో ప్రత్యేక అనుబంధం



నేను 2013లో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పాఠకులతో ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పరచుకున్నాను. జిల్లా కేంద్రంలో డిజిటల్ లైబ్రరీ కోసం ఆర్డీటీ వారిని ఒప్పించడంలో నేనూ భాగస్వామిని కావడం సంతోషంగా ఉంది. లైబ్రరీలో ప్రతి సందర్భంలోనూ పాఠకులతో కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం. ముఖ్యంగా దాతలను ఒప్పించి ఎంతో మంది విద్యార్థులకు లైబ్రరీలో సభ్యత్వం ఇప్పించాం. 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని పోరాటం సాగిస్తూనే ఉన్నాం. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలి.
– జయరాం, లైబ్రేరియన్, కొత్తచెరువు

సద్వినియోగం చేసుకోండి



నేను 2019లో పబ్లిక్ లైబ్రేరియన్‌గా పని చేశాను. తర్వాత 2021లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూనియర్ కాలేజ్ లైబ్రేరియన్‌గా చేరాను. ఈ ఉద్యోగం రావడానికి నాకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయి. నిరుద్యోగ యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాను. అర్హత కల్గిన లైబ్రేరియన్లకు ప్రిన్సిపాళ్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– విజయకుమారి, లైబ్రేరియన్, జూనియర్ కాలేజీ, కదిరి

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలో ఉన్న సుభాష్ రోడ్డులోని డ్రైనేజీ సమస్యలకు తాత్కాలిక పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. గత కొన్ని రోజులుగా సుభాష్ రోడ్డులో డ్రైనేజీ రోడ్డుపైకి వచ్చింది. కొన్నిసార్లు మేయర్ వసీం ఆ ప్రాంతంలో పర్యటించి భవిష్యత్తులో రోడ్డు వైడనింగ్ జరిగే అవకాశం ఉన్నందున తాత్కాలిక పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ ఇంజినీర్లను ఆదేశించారు. ఈ క్రమంలో ఈనెల 10న అర్ధరాత్రి నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశాలతో ఈఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో డ్రైనేజీ సమస్యకు నామినేషన్ పద్ధతిలో పైప్‌లైన్ పనులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం వరకు పైప్‌లైన్ పనులు జరిగాయి. పనులు జరిగే సమయంలో సప్తగిరి సర్కిల్ వైపుగా వచ్చే రోడ్డును అధికారులు బ్లాక్ చేసి, ట్రాఫిక్‌ను మళ్లించారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం

సుభాష్ రోడ్డులోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలసి కాలువ నిర్మాణ పనులను పర్యటించారు. రానున్న రోజుల్లో సుభాష్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన అనంతరం, డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలువ నిర్మాణంలో భాగంగా క్యూరింగ్ కావడానికి సోమవారం అవుతుందని తెలిపారు. మంగళవారం నుంచి వాహనాలు వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. కాలువ నిర్మాణ పనులు చేపట్టినందుకు కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, ఈఈ సూర్యనారాయణకు మేయర్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో నగరంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా.. తక్షణం స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ అబూసలేహా, నాయకులు దాదాఖలందర్, దాదు, తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కల్పవల్లి సొసైటీ సీఈఓ చిరంజీవి

చెన్నేకొత్తపల్లి: పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కీలకమని కల్పవల్లి సీఈఓ చిరంజీవి అన్నారు. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న కల్పవల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముష్టికోవెల సమీపంలోని కల్పవల్లి అటవీ ప్రాంతంలో రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని యువతకు పర్యావరణ పరిరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ.. 1992 నుంచి పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడుకోవాలి అనే దానిపై యువతకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. యువత పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. వన సంరక్షణ కమిటీలు చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో కల్పవల్లి సొసైటీ అధ్యక్షుడు వెంకట రమణప్ప, కల్చరల్ కో–ఆర్డినేటర్ రవి, డైరెక్టర్లు, కల్పవల్లి సిబ్బంది బాలమురళి, ఆదినారాయణ, ముఖేష్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన



వధూవరుల వివరాలు నమోదు చేసుకుంటున్న రెడ్డి సంఘం నాయకులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ పాపంపేటలో నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు మంచి స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రెడ్డి కులస్తులు వధూవరుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా రెండో ఆదివారం ఈ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్ రెడ్డి, నాయకులు దుబ్బ కిషోర్‌రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరత్నారెడ్డి, రమణారెడ్డి, బలరామిరెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్–15 బాలికల క్రికెట్ జట్టులో చోటు



చక్రిక దండు



ధారా మోహన్



మన్విత



తేజశ్విని

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–15 బాలికల టోర్నీకి సంబంధించి సౌత్‌జోన్ జట్టులో అనంతపురం బాలికలు చక్రిక దండు, ధారా మోహన్, మన్విత, తేజశ్విని చోటు దక్కించుకున్నారు. చక్రిక దండు స్వస్థలం అనంతపురం. కుడిచేతి లెగ్ స్పిన్నర్, కుడిచేతి బ్యాటింగ్, తపోవనం క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. సౌత్‌జోన్ అండర్–15లో జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లో 7 వికెట్లు తీసి సత్తా చాటింది. ధారా మోహన్ స్వస్థలం అనంతపురం. కుడిచేతి మీడియం పేస్, కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. అండర్–15 జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు తీసింది. మన్విత ఎడమ చేతి స్పిన్నర్, కుడిచేతి బ్యాటర్. అనంతపురం స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. అండర్–15 జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు సాధించింది. తేజశ్విని స్వస్థలం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి. కుడి చేతి మీడియం పేసర్, కుడి చేతి మిడిల్ ఆర్డర్ బ్యాటర్. కదిరి సబ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంది. అండర్–15 జిల్లా స్థాయి పోటీల్లో నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లతో సత్తా చాటింది.

రాగా ప్రభు విక్రమ్ లఘుచిత్రం విడుదల



చిత్ర ప్రారంభోత్సవంలో టీవీ, సినీ కళాకారులు

అనంతపురం కల్చరల్: అనంత యువకుడు కల్లూరు అర్జున్ కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించి నిర్మించిన 'రాగా ప్రభు విక్రమ్' లఘుచిత్రాన్ని విడుదల చేశారు. ఆదివారం స్థానిక నీలిమ థియేటర్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో పలువురు టీవీ, సినీ కళాకారులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. నిర్మాత జీఎం సురేష్, అబ్బా టీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ హరిప్రసాద్, సినీనటుడు రమేష్ నీల్, సామాజిక సేవా కార్యకర్త ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు మాట్లాడారు. జిల్లాకు చెందిన కల్లూరు కుటుంబం వారు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో నిష్ణాతులై ఎన్నో మంచి రచనలను అందించారని తెలిపారు. ముఖ్యంగా ప్రఖ్యాత కవి కల్లూరు అహోబిళరావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన మనవడైన కల్లూరు అర్జున్ ఇది వరకే ప్రభుత్వం అందించే అవార్డులను దక్కించుకుని జిల్లా కీర్తిని పెంచాడని పేర్కొన్నారు. మరోసారి ఆయన దర్శకత్వంలో వస్తున్న లఘుచిత్రాన్ని అన్ని సాంఘిక మాధ్యమాల్లో విడుదల చేస్తామన్నారు. మానవ సంబంధాలు, ముఖ్యంగా యువత పెళ్లి విషయంలో తల్లిదండ్రులతో ఎలా ఉండాలన్న కథాంశాన్ని ఎంతో సున్నితంగా చిత్రీకరించారని కొనియాడారు. జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా మరిన్ని చిత్రాలు నిర్మిస్తామని తెలిపారు. అంతకు ముందు థియేటర్‌లో ప్రదర్శించిన ప్రివ్యూ షోలో వందలాది మంది కళాభిమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



సేవలందించిన యువతులకు జ్ఞాపికలు అందిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని రెయిన్‌బో బాలికల అనాథాశ్రమంలో ఆదివారం ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రెయిన్‌బో హోమ్ అధ్యక్షుడు సద్దాం బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అందరిలో అవగాహన పెంచాలని సూచించారు. కేవలం స్వచ్ఛందంగా వచ్చే సేవాభావం కల్గిన వారి వల్లే ఎంతో మందికి రక్తం అందుతోందన్నారు. అనంతరం వందలాది మందికి ఉచిత రక్తగ్రూపు పరీక్షలు నిర్వహించి సేవాభావంతో సహకరించిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ డ్రాప్స్ సంస్థ అధ్యక్షులు సర్దార్‌వలి, ముజహిద్, మహ్మద్ రాకీబ్, శ్రీధర్, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమకాటు నివారణ చర్యలు

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల వర్షాలు కురువడంతో నగరంలో దోమకాటు నివారణ చర్యలు చేపట్టేలా మేయర్ వసీం చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య అధికారులు ఆదివారం నగరంలోని పాతూరు, వేణుగోపాల్ నగర్, ఇందిరాగాంధీ నగర్, జీసస్ నగర్, కోవూర్ నగర్, రాంనగర్, తదితర ప్రాంతాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. దోమకాటు నివారణ చర్యలు ముమ్మరం చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సైతం స్వీయ నియంత్రణలో భాగంగా వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా మస్కిటో కాయిల్స్, దోమ తెరలు వాడాలని సూచించారు. పారిశుధ్యం మెరుగులో భాగంగా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేసి ఎస్సీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పసలూరి ఓబులేసు కోరారు. ఆదివారం స్థానిక ఎంహెచ్‌పీఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పసలూరి ఓబులేసు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామన్నారు. తక్షణమే రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేయాలని తీర్మానం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్, బెస్ట్ అవైలబుల్ పథకం, విదేశీ విద్యా దీవెన కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఓబుళప్ప, స్టీరింగ్ కమిటి చైర్మన్‌గా వరప్రసాద్, న్యాయ సలహాదారులుగా ముత్యాలప్ప, రాష్ట్ర కార్యదర్శిగా జగదీష్, జిల్లా యువ సేన అధ్యక్షుడిగా కుళ్ళయప్ప, అనంతపురం అర్బన్ అధ్యక్షుడిగా ఈశ్వరయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పోతలయ్య, చిన్న గంగన్న, ఓబులేసు, పెద్దన్న, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో జీవించాలి

అనంతపురం: నేరాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. దారుణ హత్యలు, హీనమైన నేరాలకు పాల్పడిన 'ఏ' కేటగిరిలో ఉన్న రౌడీషీటర్లను గుర్తించి వారి స్థితిగతులపై ఆరా తీశారు. పాత పంథా పునరావృతం అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్ కదలికపై లోతుగా నిఘా వేశామన్నారు. హద్దుదాటి అల్లర్లు, అలజడులు పాల్పడినా, చెడునడతతో ఇతరుల్ని ఇబ్బందిపెట్టిన ఎవరినీ ఉపేక్షించబోమని గట్టిగా హెచ్చరించారు.

మోగిన బాజాభజంత్రీలు

అనంతపురం కల్చరల్: పవిత్ర శ్రావణమాసం... అందునా అత్యంత శ్రేష్టమైన శుక్ల పక్ష సప్తమి ముహూర్తం కావడంతో ఆదివారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ అలుముకుంది. పలుచోట్ల వివాహాలు.. నిశ్చితార్థాలు.. గృహప్రవేశాలు.. అక్షరభ్యాసాలు... అన్నప్రాసనలు... ఉపనయనాలతో మంగళవాయిద్యాలు మార్మోగాయి. వేదమంత్రాల నడుమ వందలాది జంటలు ఏకమయ్యాయి. పలు కల్యాణ మంటపాలు కిటకిటలాడాయి. ఈ సుముహూర్తం కోసం నెలల తరబడి వేచి ఉన్నామని పెళ్లి పెద్దలు చెబుతున్నారు. లాడ్జీలు, సత్రాలు బిజీగా మారిపోయాయి. ప్రత్యేకంగా పురోహితులు, అర్చకులు, పూల విక్రేతలు చాలా రోజుల తర్వాత ఆనందం వ్యక్తం చేశారు. కల్యాణమంటపాలు, ఫంక్షన్ హాళ్లు కూడా దొరకక పోవడంతో పాఠశాల ప్రాంగణాలు, కళా సంస్థలు సైతం వివాహ వేదికలుగా మారిపోయాయి.

మళ్లీ ముహూర్తాలు దూరమే..

శ్రావణమాసం సెప్టెంబరు 3న ముగుస్తుంది. ఈలోపు 11వ తేదీతో పాటూ 15 నుంచి 18, మళ్లీ 21 నుండి 24, 28 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయని పురోహితులంటున్నారు. ఇవి దాటిన తర్వాత మళ్లీ వచ్చే నెల 3 నుంచి శూన్యమాసం కారణంగా అక్టోబరు 2 వరకూ శుభముహూర్తాలు లేవని స్పష్టం చేశారు. మళ్లీ రెండు నెలల్లో ఉన్న కొన్ని ముహూర్తాలు మినహా డిసెంబరు 31 నుంచి 2025, జనవరి 29 వరకూ ముహూర్తాలు లేవని అంటున్నారు.

స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్



అనంతపురం: ఇండియా స్కేటింగ్ గేమ్స్ చాంపియన్‌షిప్–2024లో అనంతపురానికి చెందిన ఎం.హంజా హుస్సేన్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. తమిళనాడులోని పొలాచ్చిలో జరిగిన 7–9 సంవత్సరాల కేటగిరీ స్కేటింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ నాగేంద్ర తెలిపారు.

ఓం శరవణ భవాయ నమః



మూలవిరాట్‌ను అభిషేకిస్తున్న ప్రధాన అర్చకుడు రాము



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

'ఓం శరవణ భవాయ నమః' అంటూ కార్తికేయుడి నామస్మరణతో ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం మార్మోగింది. ఆదివారం... అందులోనూ శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా నుంచే కాకపొరుగున ఉన్న కర్నూలు, వైఎస్సార్ కడప, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.
– ఆత్మకూరు